# నిష్కారణ భయము

❀

= శ్రీ కపిల వేంకటరావు =

"ఇప్పుడు యుద్ధం ఆగిపోనేపోయింది. అక్కడ అల్లరులు - ఇక్కడ అల్లరులు, ఆ ఊళ్లో కత్తిపోట్లూ - ఈ ఊళ్లో తుపాకికాల్పులూ అని రోజూ ఏదో కబురువస్తూనేఉందిమరి, అప్పుడు లేని ఉపద్రవాలు ఇప్పుడేమివచ్చాయి" అని యాదాలాభంగా అంటే విశ్వనాథంగారు—ఆయన పశువులవైద్యంలో ప్రైవేటు ప్రాక్టీషనరు—ఇల్లా చెప్పారు:

"యుద్ధమా ? యుద్ధానికీన్నీ, మీరు చెప్పిన వాటికీన్నీ సంబంధం ఏముంది ? ఒక్కడిమీద కాల్చినా, అనేకమందిమీద కాల్చినా తుపాకికాల్చేవాడు చంపాలని కాలుస్తాడని తోచదు. జనం గుంపులుగుంపులుగా వచ్చారనుకోండి. వాళ్లేం జేసిపోతారో అని ముందు భయం పట్టుకుంటుంది ఇవతలివాడికి. వీడి యొక్క జీవితచరిత్రనీ, అనుభవాన్నీ అనుసరించి ఉంటుంది వీడి భయం. ఒక్కొక్కవ్యక్తి తన నీడను చూచే భయపడతాడు. కలిగిన భయాన్ని తగ్గించుకుంటే సరేసరి. లేకపోతే భయంవల్ల ఆవ్యక్తి చేసే పనులకు ఆవ్యక్తియొక్క జబాబుదారీ యెంతమాత్రం లేదు. భయమే అన్నిపనులూ చేయిస్తుంది. తనమీదికి అవతలివాడు వస్తున్నాడో, లేదో అనే జ్ఞానం ఉండదు. తన కర్ర, కత్తి, లేక తుపాకి ఎట్లాగుపట్టుకున్నాడో తనకు తెలియదు. దానితో ఏం చేస్తున్నాడో తనకు తెలియదు. ఇల్లా ఈ వ్యక్తి పనులు చేస్తుంటే అవతలివాళ్ల స్థితి ఎల్లా ఉంటుందో ఎరుగుదురా ? ఒక్క మనుష్యుడేకాక, గుంపులేఅయితే చెప్పనే అక్కరలేదు. గుంపుగా చేరకముందే వాళ్లకి ఒకవిధమైన ఆవేశం కలిగిఉంటుంది. గుంపుతో కలిసి నడిచిపోతుంటే ఆ ఆవేశం అడుగడుగుకీ హెచ్చిపోతూంటుంది. అటువంటి గుంపుకి భయం కలిగితే ఇంక చెప్పాలా? భయంచేత వాళ్లు చేసే పనులన్నీ కక్షవల్లా, కోపంవల్లా చేసినట్లు మనకు కనబడుతుంది. ఆమాటకు వస్తే కోపం రావడం అనేది భయానికి లక్షణమే. లోపల ఎంత భయం ఉంటే అంత కోపం, బోకరింపుగొంతుక పెట్టుకుని అరవడమున్నూ, చెయ్యి చేసుకోవడమూను"

విశ్వనాథంగారి ఆసుపత్రిలో ఒక పెంకుటి పాక ఉంది. దానిదగ్గరకు నన్ను తీసుకునిపోయి ఆయన, చచ్చి ఒకమూల పడిఉన్న ఒక కుక్కకళేబరాన్ని చూపించాడు. అది చాలా బీభత్సంగా ఉంది. ఒక చెవి తెగిపోయింది. రెండవ చెవి మూడు చీలికలుగా వ్రేళ్లాడుతూంది. గాయాలతో, నెత్తురు చారలతో ఒళ్లంతా పేరుకునిఉంది. నోట్లో పళ్లు మూడో, నాలుగో ఊడిపోయినాయి. పెలవులవెంట ఎరుపు నలుపుకలిసిన రంగుగల ద్రవం కారుతూంది. బుర్రమీద గాయాలతో నెత్తురు ముద్దలుగా కనబడుతూంది. ఒక కాలికి బాగా దెబ్బతగిలి బ్రతికిఉన్నప్పుడు బాగా నొప్పిపెట్టి బాధపడిందికాబోలు, చచ్చినా ఆకుక్క ఆకాలు ఎత్తిపెట్టుకునే ఉంది. మొండితోక. తుంటిమీద ఒక గాయం. నడుముమీద ఒక బలమైన దెబ్బ. ఆదెబ్బ కదుము ఎత్తుగా కనబడుతూంది; మధ్యభాగం పుండుగా కూడా ఉంది. డొక్క ఎండుకుపోయి, ఎముకలు బయటికి వచ్చేట్టుంది. దాని ఒంటినిండా, నోటినిండా, గాయాలనిండా ఈగలూ, దోమలూ, మరేవో చిన్నచిన్న రెక్కలపురుగులూ. దాని చెవులలోంచి నేలమీద ఒక కన్నంవరకూ చలిచీమలబారు. నేను చీదరించుకున్నాను. డాక్టరు విశ్వనాథంగారు మళ్లీ మొదలు పెట్టారు:

"దీని చరిత్ర వినండి. నేను చెప్పిన మాటలోగల సత్యం తెలుస్తుంది. ఇది పూర్తిగా ఉత్తమజాతి కుక్క కాదుగాని, కేవలం నాటుకుక్క కూడా కాదు. ఆ మూతి చూడండి, ఆ మొండెం పొడుగూ, కాళ్ల తీరూ, చెవులూ చూస్తే ఇది జాతికుక్కకూ, నాటుకుక్కకూ బయలుదేరిన సంకరజాతి దని నిశ్చయించుకోవచ్చును. దీనికిన్ని కొన్ని ప్రత్యేకమైన మంచి గుణాలు ఉండేఉంటాయి....

భవానీపురంలో పింఛను హవల్దారు పెంటూసాహేబును ఎరుగుదురా? ఆయన మొన్నరాత్రి చచ్చిపోయాడు. హఠాత్తుగా పోలేదు. రోగంతో తీసుకు తీసుకునే పోయినాడు. ఒక రోజురోజల్లా ఉండే ప్రాణం, ఊడే ప్రాణంగానే ఉందట. ఆ రాత్రంతా ఈకుక్క మోర యెత్తుకొని యేడ్చిందట. పెంటూసాహేబు మేనల్లుడొకడున్నాడు. వాడి పేరు మనకు తెలియదు. మరునాడు, అంటే నిన్న, ఉదయం ఎదురింట పంచక్రింద నీడలో పడుకొనిఉన్న ఈకుక్కని చూచి వాడు "ఎద్వాకుక్కా, హిదీ యేడ్సియేడ్సి సంపింది మామామూకి" అని ఒక కర్ర పుచ్చుకుని చావగొట్టాడు. కొట్టింది చాలక, రోడ్డుమీద రెండు ఫర్లాంగులదాకా వెంటతరిమి మరీకొట్టాడు. కెవ్వుకెవ్వుమని అరుస్తూ ఇది పరుగెత్తింది. బహుశః అప్పుడు తగిలినవే ఆ నెత్తిమీద దెబ్బలూ, నడుమ్మీద పీని. కాలు కుంటిపోయిందికూడా అప్పుడే అయి ఉంటుంది. నెత్తురు కారుతూ, ఏడుస్తూ, మూడు కాళ్లమీదనే నడుస్తూ ఇది ఓపికఉన్నంతసేపూ పరుగెత్తి, పొగాకుకంపెనీగేటుదగ్గర ఉన్న చెట్టునీడని పడుకుందిట. దానిమానాన్ని అది పడుకుని, దెబ్బతిన్న కాలు నాకుకుంటూఉంటే గేటుజవానుతో మాట్లాడడానికి వచ్చిన డేవిడ్ అనే మాలపిల్లవాడొకడు చూచాడు! దీన్ని. చూచి "జాకీ, జాకీ" అని పిల్చాడట. ఇది మొరిగింది. దీని వాలకమూ, ఆ మొరగడమూ చూచి వాడు "పిచ్చికుక్క" అని కేకలు వేసి, రాళ్లు రువ్వాడు. రాళ్లు తగలగానే కుక్క లేచి మళ్లీ పరుగెత్తింది. ఇది యింటివైపు పోదామని తిరిగితే అటువైపునుంచి కొందరు పొగాకుపనివాళ్లు వస్తూ దీనిని బెదరించారు. దానితో ఇది బెజవాడవైపు దారి పట్టింది. మూడుకాళ్లమీద కుంటుకుంటూ ఇది ఒక ఫర్లాంగు నడిచిందో లేదో మళ్లీ దీని కర్మం మూడింది. యజమాని ఎన్నడూ బాగుచేయించని మోటారు బస్సొకటి నడవనని భీష్మించగా దాన్ని నడిపించాలని ప్రయత్నాలుచేస్తూ దాని డ్రైవరూ, క్లీనరూ తంటాలు పడుతూ, ప్రయాణీకులనందరినీ దింపివేశారు. వాళ్లల్లో ఒక వితంతువు ఉంది. ఆవిడకుమారుడొక కుర్రవాడు ఈకుక్కనిచూచి ఒక బెత్త పుచ్చుకుని, బెదరించాడు. కుక్కకేం వచ్చిందో, మిగిలిన శక్తితోటి ఆ కుర్రవాణ్ణి కరవబోయినట్టుగా నోరు తెరిచిందట. వితంతువు 'కుయ్యో మొర్రో' అని కేకలు వేస్తూంటే, క్లీనరు తన చేతిలో ఉన్న ఇనపఊచతో కుక్కని ఒక్క దెబ్బ ఆ మొరిగే నోటిమీద కొట్టాడట. ఆ దెబ్బతోనే కాబోలు దీని పళ్లు ఊడిపోయింది. ఇది రోడ్డువిడిచిపెట్టి దక్షిణంగా పారిపోయి, కృష్ణగట్టుదాకా పోయింది. అక్కడ ఒక చెట్టునీడని పడుకుంది. భవానీపురంవాడొకడు గొల్లవాడాదారినే పోతూ, దీనిని గుర్తించి ముద్దుచేయబోయినాడు. ఇది బొంయిమంది. వాడు "పిచ్చెత్తిందా యేం" అనుకుంటూ ముందుగా సాగిపోయినాడుగాని, వాని పినతల్లి కొడుకు, వెనకాలే నడిచివస్తున్నవాడు, పిచ్చికుక్కని బ్రతకనీయకూడదంటూ దీన్ని డొక్కలో ఒక్క తన్ను తన్నాడు. ఆ తన్నుతో ఇది లేచి గట్టెక్కి బెజవాడవైపు కుంటుకుంటూ వచ్చిందట. వాటరువర్కులో ఒక డ్రైవరు తిండి తింటూ దీన్ని చూచి, రెండు ముద్దలు వేస్తే, తోకఆడించి, తినబోయి, మూచూచి, తినలేక యేడ్చి అక్కడే నూతిప్రక్కని నీళ్లు కతికి పడుకునిఉందట యిది. కాసేపటికి ఎవరో అధికారి వచ్చి, "ఛీ, వెధవకుక్క, ఇది పిచ్చికుక్కలాగ ఉంది. ఒరేయి, దీన్ని కొట్టరా" అని నౌకరుకు ఆజ్ఞ ఇస్తే వాడు దీన్ని రాళ్లతో కొట్టాడు. ఇది లేచి రోడ్డుమీదికి వచ్చింది. అక్కడ ఉన్న ఊరకుక్కలు దీనిమీద కలియబడ్డాయి. దీనికి తిండి లేదు. ఒక కాలు లేదు. నోట్లో పళ్లు కొన్ని లేవు. ఎవరైనా చూచి ఆమిగిలినకుక్కల్ని అవతలికి తోలాడో

యేమో, బెజవాడ ఊళ్లో దరిదాపుకు వచ్చింది. డి.పి. డబ్ల్యు. వర్కుషాపుకు వెనకగా పనివాళ్ల ముఠా ఒకటి పనిచేస్తూంది. ఆ ముఠాలో ఒకడు దాచుకున్న కూటి మూటప్రక్కగా ఇది ఆగిపోవడం చూచి వాడు తనకూ డెత్తుకుపోవడానికే వచ్చిందనుకుని, రాయి పుచ్చుకొని బలమైన దెబ్బ కొట్టాడు. కొట్టినందుకు వాడి భార్య వానిని కోపం జేసిందిట. అది పిచ్చికుక్క గనుక నేను కొట్టానని చెబుతూ వాడు సమర్థించుకున్నాడట. ఇది తిరుగు మొహం పెట్టి మళ్లీ భవానీపురంవైపు పరుగెత్తుతూంటే ఊరకుక్కలు మళ్లీ వచ్చిపడ్డాయి. ఇది యిటువైపు తిరిగి బెజవాడవైపే వచ్చేసింది. భార్య కోపం జేసిందని కాబోలు పనివాడు కుక్కని ఈ మారు నిరపాయంగా దాటిపోనిచ్చాడు. రోడ్డుమలుపు దాటి కాస్త నీడలో పడుకుందిట ఇది మళ్లీని. నీరసంగా ఉంది ఇది. అందుచేత ఒక పందులవాడు వచ్చి మెడకు త్రాడు వేసి కట్టినా మొరగడం తప్ప యేమీ చెయ్య లేదు. దీని మొరుగులు వాడికి లక్ష్యమా? "ఎందు కాకుక్కని కడుతున్నావు? అది పిచ్చిదిలాగుంది. కరుస్తే మోసం" అని ఎవరో చెబితే తెగ్రతాగి ఉండడం చేత ఆ పందులవాడు వినక, "ఇది పిచ్చిదిగాదు బాబయ్యో, ఇది దొంగకుక్క బాబయ్యో, ఇది నా పందిపిల్లని పొట్టనెట్టుకుంది బాబయ్యో" అని యేడుస్తూ, రాగాలు తీస్తూ, తనవెంట తన గూడానికి తీసుకు పోయినాడు. తూలుతూ తూలుతూ, సంగీతం పాడుతూ వాడు; మూడుకాళ్లమీద కుంటుతూ ఇది ప్రయాణంచేసి బందరుకాలువకు అవతలివైపున ఉన్న పందులవాళ్ల గుడిసెలలోకి పోయినారు. అక్కడ ఒక రాటకు కట్టేశాడు దీన్ని వాడు. అక్కడ అదివరకే ఉన్న కుక్కలు దీన్ని కరిచి గాయాలుచేశాయి...

బెజవాడనుంచి కృష్ణసింగనే రొట్టెలవర్తకు డొకడు రోజూ గుంటపల్లి దాకా బైసికిలుమీద వెళ్లి రొట్టెలు వాడుకలకు ఇచ్చివస్తూఉంటాడు. అతడు దీనికి రోజూ ఊరికేనే ఒక రొట్టె ఇవ్వడం మామూలుట. నిన్న సాయంకాలం ఇది కనపడకపోగా అతడు వారినీ వీరినీ అడుగుతూ వచ్చి పందులగూడెంలో ఉన్న దీనిని విడిపించి నా దగ్గరకు తీసుకునివచ్చాడు. ఏవేవో మందులు వేశాను. లాభం లేకపోయింది. కృష్ణసింగుకు ఎంత కోపం వచ్చిందని? "చాలా మంచి కుక్కండీ సార్, చాలా సాధువు. అది పిచ్చికుక్క అనీ, కరుస్తుందనీ, అది కరిస్తే చస్తామనీ, నిష్కారణభయంపడి ఊరికే కొట్టారు సార్. చచ్చిపోయింది. నాకు ఋణం తీరిపోయింది." అని కళ్లనీళ్లు పెట్టుకుని కృష్ణసింగు వెళ్లిపోయినాడు. అతనే ఈ దర్యాప్తంతా చేసి నాకు చెప్పాడు. నేను మీకు చెప్పాను."

